సాక్షి
చిత్తూరు
గురువారం । 4 । జులై । 2024



'పామ్'లో లేని ధర!

ఆయిల్ పామ్ ధరలు తిరోగమనం బాట పట్టాయి. గత ఏడాది కంటే దాదాపు 40శాతం తగ్గడం గమనార్హం. - 8లో



పొలాల్లో మయూరాలు

బంగారుపాళెం మండలంలో నెమళ్లు పొలాల్లో సంచరిస్తూ కనువిందు చేస్తున్నాయి. - 8లో



వేణుగోపాలా...

వేణుగోపాల స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పేరుతో విరాళాలు వసూలు చేయాలని గ్రామ పెద్దలు గుట్టుగా నిర్ణయించారు. - 8లో

న్యూస్‌రీల్

సీఎం పర్యటన అర్జీలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఇటీవల జరిగిన సీఎం పర్యటన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. జిల్లాలోని పలు శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటనలో ప్రజలందజేసిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. సీఎం పర్యటనలో 1140 అర్జీలు అందాయని తెలిపారు. అందిన అర్జీలన్నింటినీ సంబంధిత శాఖలకు పంపినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి సర్వీస్, ఆర్థిక అంశాలకు సంబంధించిన నివేదికలు రూపొందించి పంపాలని పేర్కొన్నారు ఆధార్‌నెంబర్, సెల్ నెంబర్ లేని అర్జీల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. శాఖల వారీగా 10 రోజుల తర్వాత ఇదే అంశంపై సమీక్ష చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డ్వామా పీడీ రాజశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా మెలగాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ శాంతకుమారి

పుత్తూరు: వైద్య శాఖలో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి అన్ని వేళలా అప్రమత్తంగా మెలగాలని తిరుపతి జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.శాంతకుమారి సూచించారు. పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం పీహెచ్‌సీలో బుధవారం చేపట్టిన వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఓఆర్‌ఎస్ కార్నర్‌ను పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. విధి నిర్వహణపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సాయిచరణ్, డాక్టర్ ఎస్.జుబేర్, ఆరోగ్య విస్తరణాధికారి కె.రమేష్‌బాబు, పీహెచ్‌ఎన్ విజయకుమారి, సూపర్‌వైజర్ మురళి పాల్గొన్నారు.

డెప్యుటేషన్ సిఫార్సు లేఖలు స్వీకరించం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల బదిలీలు, డెప్యుటేషన్లకు ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు స్వీకరించడం లేదని డీఈఓ దేవరాజు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు 2021లో జారీచేసిన మెమో 13029 ప్రకారం ఎట్టి పరిస్థితుల్లోనూ సిఫార్సులు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. టీచర్లు బదిలీలు, డెప్యుటేషన్లకు డీఈఓ కార్యాలయానికి సిఫార్సులు లేఖలు తీసుకురాకూడదని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ప్రభుత్వ టీచర్లు ఈ విషయాన్ని గమనించాలని డీఈఓ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో సర్కారు పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు అర్హత, ఆసక్తి ఉన్న వారు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ దేవరాజు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని సర్కారు బడుల్లో పనిచేస్తున్న టీచర్ల అర్హతల ఆధారంగా (కనీసం 10 ఏళ్ల సర్వీస్) కలిగి ఉండాలన్నారు. స్వతహాగా సెల్ఫ్ నామినేషన్‌ను www.nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తులు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు డీవైఈఓ, ఎంఈఓలను సంప్రదించాలని కోరారు.

టీడీపీకి ఓటు వేయలేదని పెన్షన్ తొలగింపు



గంగాభవాని

గుడుపల్లె: మండలంలోని కోటచెంబగిరి గ్రామానికి చెందిన గంగాభవాని ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయలేదని నెలనెలా వస్తున్న పెన్షన్‌ను తొలగించారు. 1వ తేదీ సోమవారం పెన్షన్ వస్తుందని, కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. పెన్షన్లు ఇచ్చే అధికారులను పింఛన్ల జాబితా నుంచి పేరు తొలగించారని, పెన్షన్ ఇవ్వడం కుదరదని చెప్పేశారు. దీంతో కొంత మంది టీడీపీ నాయకులు మండల అధికారులపై ఒత్తిడి తేవడంతో ఆమెకు పెన్షన్ నిలిపివేశారు. నడవలేని పరిస్థితిలోని గంగాభవానికి 90% వైకల్యం ఉన్న గుర్తింపు కార్డు ఉంది.

ఆన్‌లైన్ అడ్మిషన్





ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో ఆన్‌లైన్‌లో అడ్మిషన్లకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. అడ్మిషన్ల షెడ్యూల్ ఇప్పటికే చాలా ఆలస్యమైందని అధ్యాపక బృందం చెబుతోంది. ఆలస్యంగా షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం దరఖాస్తులకు తక్కువ సమయం ఇచ్చింది. ఈ నెల 10వ తేదీ లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులకు ఇక ఏడు రోజులే సమయం ఉండడంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్‌లపై ప్రత్యేక కథనం.

- డిగ్రీ అడ్మిషన్లకు షెడ్యూల్ విడుదల
- దరఖాస్తుకు తక్కువ సమయం
- ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలి
- ఈ నెల 22 నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 1వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 142 డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో సైన్స్, ఆర్ట్స్, కామర్స్, ఒకేషనల్ కోర్సుల్లో సుమారు 4,500 వరకు సీట్ల భర్తీకి అవకాశం ఉంది.

చదువు మానేసినా సర్టిఫికెట్ కోర్సు

విద్యార్థులు డిగ్రీ ఫస్టియర్ చదివి మానేసినప్పటికీ సర్టిఫికెట్ కోర్సు పేరుతో సర్టిఫికెట్ పొందవచ్చు. రెండేళ్లు అయితే డిప్లొమా సర్టిఫికెట్, మూడేళ్లు అయితే డిగ్రీ సర్టిఫికెట్, నాలుగేళ్లు చదివితే డిగ్రీ ఆనర్ సర్టిఫికెట్‌ను అందిస్తారు. విద్యార్థి డిగ్రీ నాలుగేళ్లలో ఎప్పుడైనా మధ్యలో చదువు మానేసేందుకు వెసులుబాటు ఉంది. దానికి అనుగుణంగానే సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. ఫస్టియర్ నుంచి నాలుగేళ్లలోపు ఏ దశలో చదువు మానేసినా, ఏడేళ్ల లోపు తిరిగి ప్రవేశం పొంది విద్యాభ్యాసం కొనసాగించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. డిగ్రీ విద్యా విధానంలో ప్రవేశ పెట్టిన నూతన సింగిల్ మేజర్ ఆనర్స్ డిగ్రీ పద్ధతిపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గత విద్యా సంవత్సరం నుంచే నూతన విద్యా విధానం అమలవుతోంది.

నిబంధనలకు అనుగుణంగా సీట్లు

డిగ్రీ కోర్సుల్లో 50 శాతం రిజర్వేషన్లు తప్పనిసరి చేశారు. ఇంటర్‌లో కామర్స్ ఒక సబ్జెక్టుగా చదివిన వారికి బీకాం కోర్సులో 60 శాతం సీట్లు కేటాయిస్తారు. ఆర్ట్స్, హ్యూమానిటీస్‌లో ఇంటర్ పూర్తి చేసిన వారికి బీఏ సీట్లలో 50 శాతం సీట్లు కేటాయిస్తారు. తక్కిన 50 శాతం ఇంటర్‌లో సైన్స్ గ్రూపు పూర్తి చేసిన వారికి కేటాయిస్తారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ సాధారణ కోర్సులతో పాటుగా, కంప్యూటర్, మార్కెట్ ఓరియంటెడ్, స్కిల్ ఓరియంటెడ్, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. విద్యార్థులు www.aprche.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు దగ్గర్లో ఉన్న డిగ్రీ కళాశాలకు వెళ్లి రిజిస్ట్రేషన్‌కు చేసుకోవచ్చు. సాధారణ కోర్సులకు రూ.3 వేల వరకూ, కంప్యూటర్ కోర్సులకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకూ ఫీజు ఉంటుంది.

ఉమ్మడి జిల్లా పరిధిలో..

మొత్తం డిగ్రీ కళాశాలలు	142
టీటీడీ కళాశాలలు	03
ప్రభుత్వ కళాశాలలు	17
ప్రైవేట్ కళాశాలలు	122
విద్యార్థుల సంఖ్య	46 వేలు

ఇదే షెడ్యూల్

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మంగళవారం మొదలైంది. ఈ నెల 10వ తేదీ వరకూ విద్యార్థులు ఆన్‌లైన్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందులో భాగంగా ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్ ఉంటుంది. స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్లు ఆయా యూనివర్సిటీల్లో ప్రాంతాల వారీగా నిర్వహిస్తారు. ఈ నెల 5న ఓపెనింగ్ ఆఫ్ హెచ్‌ఎల్‌సీ ఫర్ వెరిఫికేషన్ ఆఫ్ సర్టిఫికెట్స్ ఉంటుంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కోర్సులను ఎంపిక చేసుకోవడం కోసం ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. ఈ నెల 19న సీట్లు కేటాయించి, అలాట్ అయిన విద్యార్థులు ఎంపికైన కళాశాలల్లో ఈ నెల 20 నుంచి 22వ తేదీలోగా రిపోర్ట్ చేయాలి. ఈ నెల 22 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు

జాతీయ విద్యా విధానం 2020 నిబంధనలను అనుసరించి ఏపీ ఉన్నత విద్యా మండలి ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశ పెట్టింది. సంప్రదాయక మూడేళ్ల డిగ్రీ కోర్సుల స్థానంలో నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులను అమలు చేస్తున్నారు. ఈ కోర్సుల్లో గతంలో మాదిరిగా మూడు మేజర్ సబ్జెక్టులు కాకుండా, ఒక్కటే మేజర్ సబ్జెక్టు ఉంటుంది. దీన్ని సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సుగా పిలుస్తారు. ఉదాహరణకు గతంలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా బీఎస్సీ చదువుకునే విద్యార్థి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో బీఎస్సీ బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీల్లో ఏదో ఒక సబ్జెక్టును మేజర్ సబ్జెక్టుగా ఎంచుకుని, తనకు నచ్చిన వేరే సబ్జెక్టును మైనర్ సబ్జెక్టుగా ఎంచుకుని చదువుకోవాలి. ఇంటర్‌లో ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులతో సంబంధం లేకుండా ఏ సబ్జెక్టునైనా మైనర్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చు.



లైబ్రరీలో చదువుకుంటున్న డిగ్రీ విద్యార్థులు

అత్యున్నత ప్రమాణాలు



ఇంటర్, తత్సమాన విద్యార్హత ఉన్న వారు డిగ్రీ కళాశాల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగ్గా ఉన్నాయి. అత్యున్నత ప్రమాణాలతో మా కళాశాలలో బోధన ఉంటుంది. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్స్ ఉన్నాయి. అడ్మిషన్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ పి.జీవనజ్యోతి, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిత్తూరు

సద్వినియోగం చేసుకోవాలి



డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. తక్కువ ఫీజులతో, అన్ని రకాల సౌకర్యాలతో చదువుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంది. పుంగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో అత్యధిక మంది విద్యార్థులు ఎంపికవుతున్నారు.

– డాక్టర్ వై.రాజశేఖర్, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుంగనూరు

టీటీడీకి కూరగాయల వితరణ



తిరుమలకు కూరగాయలను పంపుతున్న దాతలు

పలమనేరు: పట్టణానికి చెందిన శ్రీవారి సేవకులు కాప్పల్లి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ట్రాన్స్‌పోర్ట్ యజమానులు మోహన్‌రెడ్డి, అమరనాథరెడ్డి సొంత నిధులతో టీటీడీకి పది టన్నుల కూరగాయలను బుధవారం పట్టణం నుంచి తిరుమలకు ప్రత్యేక వాహనంలో పంపారు. ఈ సందర్భంగా టీటీడీ వాహనానికి పూజలు నిర్వహించి గోవిందనామ స్మరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో బాబు, సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

గురుకుల జిల్లా కో–ఆర్డినేటర్‌గా ప్రభావతి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్‌గా ప్రభావతి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల డీసీఓగా పనిచేస్తున్న జయభారతి ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆ పోస్టులో తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి పాఠశాల ప్రిన్సిపల్ ప్రభావతిని నియమించారు. ఆ పోస్టులో రెగ్యులర్ అధికారి వచ్చేవరకు ఆమె పూర్తి అదనపు బాధ్యతలను నిర్వహించనున్నారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

పాడి పరిశ్రమ అభివృద్ధిలో ఏపీ ఫస్ట్

- మహిళల భాగస్వామ్యమే కారణం
- కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి వర్షాజోషి



శ్రీజ డెయిరీ సభ్యులకు మెగా చెక్ అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి వర్షా జోషి

తిరుపతి రూరల్/అర్బన్ : ఆధునిక పద్ధతులు, మహిళల భాగస్వామ్యంతోనే పాల ఉత్పత్తిలో ఏపీ అగ్రపథాన పయనిస్తోందని కేంద్ర ప్రభుత్వ పశుసంవర్ధక, పాడి పరిశ్రమశాఖ అదనపు కార్యదర్శి వర్షా జోషి తెలిపారు. తిరుపతిలో బుధవారం నిర్వహించిన శ్రీజ డెయిరీ పదో వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీజ డెయిరీ సభ్యులకు రూ.11.12 కోట్ల ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. వర్షా జోషి మాట్లాడుతూ 1.20 లక్షల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా యాజమాన్యంలోని పాల ఉత్పత్తి సంస్థగా శ్రీజ డెయిరీ ఎదిగిందని కొనియాడారు. ఈ సంస్థ రోజుకు 8లక్షల లీటర్ల పాలను సేకరిస్తోందన్నారు. గత కొన్నేళ్లుగా పాల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన పురోగతి సాధించిందని, శ్రీజ వంటి సంస్థలు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని వెల్లడించారు. పాల ఉత్పత్తిలో ఏపీ ప్రస్తుతం దేశంలోనే 5వ స్థానంలో ఉందని, మొదటి 3 స్థానాలను లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ గణాంకాల ప్రకారం ఏపీలో పాల ఉత్పత్తి 2014–15లో 96.56 లక్షల టన్నులు ఉండగా, 2022–23 నాటికి 1.54 కోట్ల టన్నులకు పెరిగిందని వివరించారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ డాక్టర్ మీనేష్ షా మాట్లాడుతూ శ్రీజ డెయిరీ పదేళ్ల ప్రస్థానంలో అనేక మైలురాళ్లను అధిగమించినందుకు రైతులను అభినందించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కో–ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్‌లో కార్యకలాపాలను శ్రీజ ప్రారంభించిందని, ఆ తర్వాత పొరుగు రాష్ట్రాలతో సహా పన్నెండు జిల్లాలకు విస్తరించిందని వివరించారు.

సామరస్యంగా పరిష్కరించుకుందాం

- జెడ్పీ స్థాయి సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు
- శాఖలవారీగా ప్రగతిని నివేదించిన అధికారులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



పాల్గొన్న ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు

చిత్తూరు కార్పొరేషన్: సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకుందామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక తొలి జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాన్ని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. సీఈఓ గ్లోరియా ఆధ్వర్యంలో చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏ సమస్య ఉన్నా దాన్ని పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ తెలిపారు. సీఎం, డిప్యూటీ సీఎంల పరంగా పాలన పరమైన సలహాలను తీసుకొని ముందుకు వెళదామన్నారు. తొలుత ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలిచిన వారికి చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. పలుశాఖల వారీగా సాధించిన ప్రగతిని అధికారులు నివేదించారు. పంచాయతీల్లో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయని డీపీఓ లక్ష్మి తెలిపారు. ట్యాంకర్లను శుభ్రం చేసి ఫొటోలు పంపుతున్నారని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యుత్ సమస్యలను నేరుగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు అన్నారు. చెరువుల పరంగా ఉన్న సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఎస్‌ఈ విజయ్‌కుమార్ తెలిపారు. వైద్యసేవల పరంగా సమస్యలను పరిష్కరిస్తామని డీఎంహెచ్‌ఓ ప్రభావతి అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి, పలు శాఖల జిల్లా అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పసుపు రంగు వేయండి

చిత్తూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులు బ్లూ రంగులో ఉన్నాయి. వాటికి పసుపు రంగు వేయాలి. అలాగే ట్యాంకర్లను శుభ్రం చేసి ఆ ఫొటోలను డీపీఓకు పెట్టే విధంగా చూడాలి. శిథిలావస్థలో ఉన్న ట్యాంకుల స్థానంలో కొత్తవి నిర్మించాలి. జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన వ్యర్థాలను చెరువులో వేయకుండా చూడాలి. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలి.

– గురజాల జగన్‌మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే

అధికారులు హాజరవ్వాల్సిందే

ఎమ్మెల్యేలు హాజరయ్యే సమావేశాలకు జిల్లా అధికారులందరూ హాజరుకావాల్సిందే. ఐరాల మండలం ఎస్సీ కాలనీలో కరెంటు స్తంభం ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈను ఆదేశిస్తే పట్టించుకోలేదు. తవణంపల్లెలో వ్యవసాయానికి సక్రమంగా కరెంటు ఇవ్వడం లేదు. ఎప్పుడు పడితే అప్పుడు కట్ అవుతోంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా వాటర్ ట్యాంక్‌లను ఎందుకు శుభ్రం చేయడం లేదు. అధికారులు జెడ్పీటీసీలకు గౌరవం ఇవ్వాలి. శాఖాపరంగా అధికారులు సమాచారం ఇవ్వడం లేదు.

– మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

వారిని సస్పెండ్ చేస్తాం

చంద్రగిరి నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై తప్పకుండా చర్యలు తీసుకోవాలి. వంక పోరంబోకు స్థలంలో నిర్మించిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇస్తారు. రెవెన్యూ, ట్రాన్స్‌కో, ఇరిగేషన్ అధికారులు ఇష్టారాజ్యంగా నడుచుకున్నారు. అలాంటి అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఉన్నతాధికారులు నిర్ణయిస్తారు. అక్రమాలకు సహకరించిన అధికారుల సస్పెన్షన్‌కు అన్ని చర్యలూ తీసుకుంటాం. పలు ప్రాంతాల్లో ఉన్న నీటి సమస్యను పరిష్కరించాలి.

– పులివర్తినాని, చంద్రగిరి ఎమ్మెల్యే

వైద్యశాఖ తీరు అధ్వానం

పుత్తూరులో సరైన వైద్య సేవలు అందక పుట్టిన బిడ్డ చనిపోయాడు. ఇలాంటి పరిస్థితి జిల్లా అంతటా ఉంది. వైద్యశాఖ తీరు అధ్వానంగా మారింది. డాక్టర్లు ఆస్పత్రుల్లో సమయపాలన పాటించడం లేదు. నియోజకవర్గంలో అనర్హులకు సంక్షేమ పథకాలు అందించారు. వీటిని మరోసారి పరిశీలించి నివేదిక రూపొందించాలి. ఎన్టీఆర్ జలాశయం ద్వారా 33 చెరువులను అనుసంధానం చేసి నీటిని నింపాలి. కృష్ణాపురం జలాశయం పనులు పూర్తి చేసి రైతులకు వ్యవసాయానికి సరిపడా నీరు అందించాలి.

– థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే

నేడు విద్యాసంస్థలు బంద్



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 4వ తేదీన (గురువారం) విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నీట్ పరీక్షల లీకేజీకి నిరసనగా ఐక్య విద్యార్థి సంఘాలు దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీల నిర్లక్ష్యానికి కారణమైన కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై విచారణ కమిటీని నియమించి సమగ్రంగా విచారణ చేయించాలన్నారు. జిల్లాలోని విద్యాసంస్థలన్నీ బంద్‌కు సహకరించాలని కోరారు.

నేడు అధికారికంగా అల్లూరి జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీన అధికారికంగా అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా జూలై 4న అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా జరుపుకుంటామన్నారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ వద్ద కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

క్లుప్తంగా

పొలాల్లో మయూరాలు


మొగిలి శివాలయం సమీపంలో నెమలి

బంగారుపాళెం: పంటపొలాల వద్ద వన మయూరాలు(నెమళ్లు) కనువిందు చేస్తున్నాయి. మండలంలోని మొగిలి శివాలయం సమీపంలో బుధవారం అటవీప్రాంతం నుంచి రెండు మగ నెమళ్లు పొలాల వద్ద సంచరించాయి. నెమళ్లను పలువురు రైతులు చూసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. జాతీయ పక్షులను కాపాడుకోవాల్సిన సామాజిక బాధ్యత మనందరిపై ఉందంటూ చర్చించుకున్నారు.

టమాటా పంటపై ఏనుగుల దాడి


దెబ్బతిన్న టమాటా పంట

సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ కే.గొల్లపల్లె సమీపంలోని టమాటా పంటపై మంగళవారం రాత్రి ఏనుగులు దాడి చేసినట్టు బాధితుడు తెలిపాడు. ఏనుగుల దాడిలో ఎకరా టమాటా పొలం, పైప్‌లైన్ దెబ్బతినట్టు రైతు రవి వాపోయాడు. ఏనుగుల దాడి నుంచి పంటపొలాలను రక్షించేలా అటవీ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆనందం.. అంతలోనే విషాదం

ఈ లోకంలోకి వచ్చినట్టే వచ్చి.. మా జీవితాల్లో సంతోషం నింపినట్టే నింపి.. అంతలోనే అనంతలోకాలకు వెళ్లిపోయావా నా చిట్టీ తండ్రీ అంటూ ఆ తల్లి గుండెలు పగిలేలా రోదించింది. వంశోద్ధారకుడు పుట్టాడన్న ఆనందం అంతలోనే ఆవిరైపోయిందంటూ ఆ తండ్రీ ఆక్రందన అందరినీ కలిచివేసింది. మా కడుపు కోతకు కారణం డాక్టర్ల నిర్లక్ష్యమేనని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది.

- పుట్టిన కొన్ని గంటలకే కన్నుమూసిన మగశిశువు
- పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన
- డాక్టర్ల నిర్లక్ష్యం వల్లేనంటున్న బాధితులు
- బాధితుల ఆక్రందనలతో దద్దరిల్లిన ఆస్పత్రి
- విచారణకు ఆదేశించిన డీఎంహెచ్‌ఓ శ్రీహరి


బిడ్డ తల్లిదండ్రులను విచారిస్తున్న డీసీహెచ్‌ఎస్ మురళీకృష్ణ


మృతి చెందిన శిశువు

పుత్తూరు: ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం రాత్రి పురుడు పోసుకున్న మగబిడ్డ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బాధితుల కథనం మేరకు, కార్వేటినగరం మండలం ద్వారకానగర్‌కు చెందిన జి.నరేష్ తన భార్య పూర్ణిమ(27)ను తొలి కాన్పు కోసం ఈనెల 1వ తేదీ సోమవారం రాత్రి 7.50 గంటలకు పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. గైనకాలజిస్ట్ డాక్టర్ హిమబిందు పూర్ణిమను పరీక్షించి అంతా సజావుగా ఉందని చెప్పి, రాత్రి 10.42 గంటలకు నార్మల్ డెలివరీ చేసింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారంటూ వార్డుకు షిఫ్ట్ చేశారు. మంగళవారం రాత్రి 8.10 గంటలకు రౌండ్స్‌కు వచ్చిన డాక్టర్ దినేష్ బిడ్డను పరిశీలించి, లోపలికి తీసుకెళ్లారు. తరువాత 8.30 గంటలకు బిడ్డను తల్లి చేతికందిస్తూ చనిపోయాడు, తీసుకెళ్లండంటూ చెప్పడంతో తల్లి పూర్ణిమ కుప్పకూలిపోయింది. ఆ సమయంలో మంచినీళ్లు అడిగితే సిబ్బంది ఏమాత్రం పట్టించుకోకుండా డాక్టర్‌తోపాటు గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. ఆస్పత్రిలో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో బయటకు వెళ్లి వాటర్‌బాటిల్ తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు పూర్ణిమకు నీళ్లు తాగించి ఉపచర్యలు చేశారు. గది లోపలికి వెళ్లిన డాక్టర్ కానీ, నర్సులు గానీ రెండు గంటల పాటు బయటకు రానేలేదు. అప్పుడే ఆస్పత్రికి వచ్చిన డ్యూటీ డాక్టర్ అశోక్ బాధితులు అడిన ప్రశ్నలకు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో వారిలో ఆవేశం కట్టలు తెంచుకుంది. దీంతో ఆస్పత్రి ఆవరణ అరుపులు కేకలతో దద్దరిల్లింది.

బాధితుల ప్రశ్నలివి

- పురిటి బిడ్డ కనీసం 48 గంటల పాటు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలి కదా?
- ఎలాంటి పర్యవేక్షణ లేకుండా వార్డులో తల్లీ బిడ్డను వదిలేస్తే సరిపోతుందా?
- డెలివరీ అయిన 21 గంటల తర్వాత డాక్టర్ బిడ్డ వద్దకు రావడం కరెక్టేనా?
- బిడ్డను లోపలికి ఎందుకు తీసుకెళ్తున్నారో కూడా తల్లికి ఎందుకు చెప్పలేదు?
- కనీసం బిడ్డ మృతికి కారణమేంటో కూడా చెప్పకపోవడంలో ఆంతర్యమేమిటి?

పంచనామా నిర్వహించిన తహసీల్దార్

బాధిత కుటుంబం కార్వేటినగరం మండలానికి చెందిన వారు కావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కార్వేటినగరం మండల తహసీల్దార్ పుష్పకుమారి పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి, డాక్టర్లు, నర్సుల నుంచి వేర్వేరుగా స్టేట్‌మెంట్స్ రికార్డు చేశారు. నివేదికను చిత్తూరు కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తహసీల్దార్ పుష్పకుమారి తెలిపారు. తిరుపతి ఆర్డీఓ నిశాంతిరెడ్డి ఆస్పత్రికి చేరుకొని విచారణ చేపట్టారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి, డీసీహెచ్‌ఎస్ మురళీకృష్ణ

విచారణకు ఆదేశించాం

"పుత్తూరు ఆస్పత్రిలో జరిగిన ఘటనపై విచారణకు ఆదేశించాం. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మురళీకృష్ణ నేతృత్వంలో చేపట్టిన విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. రాత్రి 8.10 గంటలకు రౌండ్స్‌కు వెళ్లిన డాక్టర్ బిడ్డను పరిశీలించి, అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి బిడ్డను లోపలికి తీసుకెళ్లి సీఆర్‌పీ చేశారు. కృత్రిమ శ్వాస ఇవ్వడానికి ప్రయత్నించారు. అయితే ఊపిరితిత్తిలోకి పాలు చేరినట్లు గుర్తించి బిడ్డ అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించుకున్నారు. అయితే బిడ్డ పాలు తాగి నిద్రపోతున్నట్లు తల్లి భావించింది. తల్లి పడుకొని బిడ్డకు పాలుపట్టించడం వల్ల పాలు గొంతులోంచి ఊపిరితిత్తుల్లోకి వెళ్లి ఊపిరాడక మృతి చెందినట్లు డాక్టర్లు భావిస్తున్నారు.

– శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

చెరువులో వ్యక్తి శవం


మృతి చెందిన వ్యక్తి

గుడిపాల: మండలంలోని గట్రాళ్ల మిట్ట పంచాయతీకి సంబంధించి బొమ్మినాయనిచెరువులో బుధవారం వ్యక్తి శవం లభ్యమైనట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు, బొమ్మినాయని చెరువులో వ్యక్తి శవం ఉన్నట్లు వీఆర్‌ఓ వేలాయుధం నుంచి ఫిర్యాదు వచ్చిందన్నారు. అక్కడికి వెళ్లి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. మృతుని వయస్సు 35 ఏళ్లు ఉంటుందన్నారు. ఆధార్ కార్డు ఆధారంగా అసోం రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదాయం పెంచడమే లక్ష్యం


ఏజెంట్ పాయింట్ ప్రారంభిస్తున్న డీఆర్ నాయుడు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ ఆదాయం పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు కార్గో విభాగం జిల్లా ఇన్‌చార్జి డీఆర్ నాయుడు తెలిపారు. బుధవారం తిరుపతిలోని పద్మావతిపురంలో ఓటేరు మార్గం వద్ద కార్గో ఏజెంట్ పాయింట్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో ఏజెంట్లను తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కేవలం రూ.1,000 చెల్లిస్తే ఏజెంట్‌గా అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ఇప్పటికే తిరుపతిలో 8 మంది ఏజెంట్లు ఉన్నారన్నారు. బుకింగ్‌పై 15శాతం ఏజెంట్లకు కమిషన్ ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తిగలవారు తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని కార్గో పాయింట్ వద్ద సంప్రదించాలని సూచించారు.

షాడో ఎమ్మెల్యేకి 15 బ్రేక్ దర్శన టికెట్లు!

తిరుమల : తిరుమలలో సంప్రదాయాలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించి.. తీరా తమకు తోచిన వారికి అత్యధిక టికెట్లు కేటాయించేలా టీటీడీపై ఒత్తిడి తెస్తోంది. సాధారణంగా టీటీడీ నియమావళి ప్రకారం రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న వారు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖులు స్వయంగా దర్శనానికి వస్తే, వారితో పాటు వచ్చేవారికి కూడా ప్రొటోకాల్ వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు జారీ చేస్తారు. వారు స్వయంగా రాకుండా కుటుంబ సభ్యులు వస్తే రెఫరల్ ప్రొటోకాల్ బ్రేక్ దర్శనం కల్పిస్తారు. అయితే తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దర్శనానికి స్వయంగా రాకపోయినప్పటికీ, ఆయన అన్న కుమారుడు శివకుమార్‌తో పాటు మరో 14 మందికి ప్రొటోకాల్ బ్రేక్ దర్శనాలు కేటాయించారన్న వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఎంత షాడో ఎమ్మెల్యే అయినా 14 బ్రేక్ దర్శనాలు ఎలా ఇస్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై టీటీడీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో వేచి చూడాలి.

పరికరాల సరఫరాకు టెండర్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలోని సొసైటీ ఫర్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఎస్ఎస్ఐఐఈ) టెక్నాలజీ ఇంక్యుబేటర్ కోసం ఎఫ్ఏబీ ల్యాబ్ సరఫరా, ఇన్‌స్టలేషన్ పరికరాల కోసం ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. టెండర్ల దరఖాస్తుల స్వీకరణ ఈనెల 5 నుంచి ప్రారంభమై 29వ తేదీతో ముగుస్తుందని పేర్కొన్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం ప్రభంజనం


జీజే యశ్విన్‌కుమార్


బేరి భారత్


ఎస్.మోహిత్


ఎస్.వంశితశ్రీ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ ఏడాది జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష రెండో జాబితాలో విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ ఫలితాల్లో జీజే యశ్విన్‌కుమార్, బేరి భారత్, ఎస్.మోహిత్, ఎస్.వంశితశ్రీ సీట్లు సాధించారు. వీరితో మొత్తం నవోదయ విద్యాలయాల్లో ఈ ఏడాది తమ విద్యార్థులు 52మంది సీట్లు సాధించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి తెలిపారు. గత 34 ఏళ్లుగా జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తుండడంతో తమ విద్యా సంస్థకు గర్వకారణమని తెలిపారు. అనంతరం విద్యార్థులను విశ్వనాథ రెడ్డి, ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్‌రెడ్డి అభినందించారు.

వేణుగోపాలా.. విరాళాల మర్మమేమిటి?

- ఆలయంలో గుట్టుగా సమావేశం
- రూ.3 కోట్ల నిధులతో ఆలయ అభివృద్ధి


చౌడేపల్లె వేణుగోపాలస్వామి ఆలయంలో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

చౌడేపల్లె: మండల కేంద్రంలోని బజారువీధిలో వెలసిన పురాతన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ జీర్ణోద్ధారణకు విరాళాల వసూలుకు అధికారులు, కొందరు గ్రామపెద్దలు కలిసి సమావేశమయ్యారు. గ్రూప్ టెంపుల్ ఈఓ కమలాకర్, కొందరు గ్రామస్తులు కలిసి గుట్టుగా ఆలయంలో సమావేశం నిర్వహించడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని గత ప్రభుత్వ హయాంలో దేవదాయశాఖ సీసీఎఫ్ నిధులు సుమారు రూ.2 కోట్లతో అత్యంత సుందరంగా అభివృద్ధి చేశారు. పనులు పూర్తిచేసి నెలలు గడవడంతో ఆలయ జీర్ణోద్ధారణకు చర్యలు చేపడుతున్నారు. ఈ ఆలయానికి వందల ఎకరాల మాన్యం భూములు ఆక్రమణదారుల చెరలో ఉన్నాయి. కనీసం మాన్యం భూములపై ఎలాంటి చర్యలు తీసుకుపోగా గుడి పేరుతో చందాలు, విరాళాలు వసూలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. విరాళాల వసూలు పేరిట కొందరు అక్రమార్జన చేయడానికి పథకం వేశారని ప్రచారం సాగుతోంది. గతంలో కూడా టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం పేరిట నగదు వసూలు చేసి, ఇప్పటికీ నిర్మాణ పనులు చేయలేదు. ఆ నగదును కొందరు స్వాహా చేసినట్లు గ్రామ పెద్దలు ఆరోపణలు చేస్తున్నారు. ఆ భూముల్లో ఫలసాయం పొందేందుకు లీజుకు ఇస్తే, వచ్చిన ఆదాయంతో ఆలయ అభివృద్ధికి వనరులు సమకూర్చుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. కొందరు రాజకీయ పలుకుబడిని వినియోగించుకొని ఆక్రమిత స్థలాల్లో భవనాలు, వ్యవసాయం చేసుకొంటూ ఏళ్ల తరబడి అనుభవిస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడం విశేషం. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈఓ ఏమన్నారంటే...

ఈ విషయమై గ్రూప్ టెంపుల్ ఈఓ కమలాకర్‌ను రహస్య సమావేశంపై వివరణ కోరగా సమావేశం నిర్వహించలేదని, జీర్ణోద్ధారణ విషయమై చర్చించామని నిధుల సమకూర్చడంపై మాట దాటవేశారు. ఆక్రమిత భూముల అంశంపై అడగ్గా రికార్డుల ప్రకారం పరిశీలిస్తామని బదులిచ్చారు.

శ్రీసిటీ సందర్శనలో ఐఆర్ఎస్‌లు


శ్రీసిటీ ఎండీతో మాట్లాడుతున్న అధికారులు

శ్రీసిటీ(వరదయ్యపాళెం): శ్రీసిటీ పారిశ్రామిక వాడను ఐఆర్ఎస్ అధికారులు గోరసే ప్రసాద్ దత్తాత్రయ, కంచన్ రామ్ మీనా బుధవారం సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు. పారిశ్రామిక నగరం, ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలోని వ్యాపార అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలపై ఐఆర్ఎస్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పచ్చని వాతావరణంలో పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేయడంపై అభినందించారు.

నాడు అక్రమం.. నేడు సక్రమం!


గ్రావెల్ లారీలకు కారును అడ్డుగా పెట్టిన టీడీపీలోని ఒక వర్గం నేతలు

చిల్లకూరు : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రావెల్ తరలిస్తుంటే అక్రమంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని టీడీపీ నేతలు అప్పట్లో గగ్గోలు పెట్టేవారు. అయితే ఇప్పుడు పచ్చపార్టీ నాయకులే ప్రభుత్వ భూముల్లోని గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలిస్తూ కాసులు వెనకేసుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రావెల్, మట్టి తరలింపును చేపట్టిన టీడీపీ శ్రేణుల మధ్య గొడవలు ఏర్పడి వివాదం తీవ్రం కావడంతో నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇరు వర్గాలకు రాజీ కుదిర్చినట్లే తెలిసింది. తీర ప్రాంత గ్రామాల్లో గ్రావెల్ బాగా దొరుకుతుంది. ముఖ్యంగా ప్రభుత్వ భూముల్లోని గ్రావెల్‌పై కన్నేసిన ఇద్దరు టీడీపీ నేతలు ఒక్కటై తీర ప్రాంతంలోని పరిశ్రమలకు సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో నిరంతరాయంగా గ్రావెల్ తరలించేస్తుండడంతో అదే పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు అడ్డుకున్నారు. తమకు తెలియకుండా ఎలా ఒప్పందం చేసుకుంటారని గ్రామంలోని కొంత మందితో కలసి లారీలను నిలిపి వేశారు. దీంతో తమ్ముళ్ల మధ్య వివాదం ముదిరి పాకాన పడింది. మా ప్రాంతంలో ఒప్పందం చేసుకుంటే మాకు వాటా రావాలి కదా అని ఒకరు, మీకు ఎందుకు భాగం ఇవ్వాలని మరొకరు పట్టు బట్టారు. దీంతో లారీలు పూర్తిగా నిలిచి పోయి గంటల తరబడి రోడ్డుపై బారు తీరాయి. ఈ విషయం నియోజకవర్గ ప్రతినిధి దృష్టికి పోవడంతో రెండు వర్గాల నాయకులను పిలిపించి మధ్యస్థం చేసినట్లు సమాచారం. ఇకపై వివాదాల జోలికి వెళ్లకుండా పనులు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. గతంలో గ్రావెల్ తరలిస్తుంటే గగ్గోలు పెట్టిన వారే, నేడు అక్రమ రవాణాను ఎంచుకోవడంపై స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. అప్పుడు అక్రమమైనది.. ఇప్పుడు సక్రమంగా మారిపోతుందా అని మండిపడుతున్నారు.

'పామ్'లో లేని ధర!

- తగ్గిన పామాయిల్ ధర
- దిగుమతి సుంకం రద్దుతోనే ధరలు పతనం
- గతేడాదితో పోల్చితే సగానికి పడిపోయిన ధరలు
- గత ఏడాది టన్ను రూ.24వేలు
- ఈ ఏడాది టన్ను రూ.13 వేలు
- జిల్లాలో 320 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు


శ్రీకాళహస్తి మండలంలోని టీఎంవీ కండ్రిగలో సాగులో ఉన్న పామ్‌ఆయిల్ పంట

తిరుపతి అర్బన్: ఆయిల్‌పామ్ ధరలు తిరోగమనం బాట పట్టాయి. క్రూడ్ ఆయిల్‌పై కేంద్రం దిగుమతి సుంకం రద్దు చేయడం, ఇతర కారణాలతో ఆయిల్ పామ్ ధరలు భారీగా పడిపోతున్నాయి. గతేడాదితో పోల్చితే 40 శాతం మేర ధరలు తగ్గాయి. అంతర్జాతీయంగా వచ్చే 80 ఏళ్ల వరకు ఆయిల్‌పామ్‌కు విపరీతంగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతుండగా దానికి విరుద్ధంగా ధరలు పతనమవుతుండడం అన్నదాతను కలచివేస్తోంది. ఐదేళ్ల నుంచి వరుసగా ధరలు పెరుగుతూ రాగా ఈ ఏడాది మాత్రం తగ్గుముఖం పట్టాయి. ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో తిరుపతి జిల్లాలో పండించే పంటను సైతం ఏలూరు జిల్లాకు ఏటా ఎగుమతి చేస్తుంటారు. వాణిజ్య పంటల్లో అగ్రగామిగా ఉన్న ఆయిల్ పామ్ సాగును తిరుపతి జిల్లాలో 2019లో 50 ఎకరాలతో మొదలై ప్రస్తుతం 320 ఎకరాల్లో సాగు చేస్తునఅనరు. మరో రెండేళ్లలో 1000 ఎకరాలు పెరగవచ్చని అధికారుల అంచనా. ఏడాదిలో రెండు సార్లు పంట చేతికి వస్తుంది. దిగుబడి తక్కువగా ఉంటే ఎకరానికి 3–6 టన్నులు, దిగుబడి బాగా ఉంటే 8 నుంచి 11 టన్నులు చేతికందుతుంది.

తిరోగమనంలో ధరలు

ఆయిల్‌పామ్ ధరలు తిరోగమనంలో కొనసాగుతున్నాయి. 2017లో సగటున టన్ను రూ.8 వేలు ఉన్న ధర అంతర్జాతీయ పరిణామాలు డిమాండ్ కారణంగా 2022 నాటికి అది రూ.26 వేలకు చేరింది. ఆ తరువాత క్రూడ్ ఆయిల్‌పై దిగుమతి సుంకం రద్దు చేయడంతో ఆయిల్‌పామ్ ధర తిరోగమనం బాట పట్టింది. గతేదాది రూ.24 వేలు సగటున ఉండగా ఈ ఏడాది రూ.13,180కి చేరింది.

ఆయిల్ పామ్ ధర

సంవత్సరం	ధర రూ
2017	8,500
2018	8600
2019	7700
2020	10,000
2021	17,951
2022	26,000
2023	24,000
2024	13,180



